వ్యాపారాల లాగ పుష్ప విక్రయం చిన్న సైజు టాలాటోలీ వ్యాపారంగా మిగిలిపోయింది. అయితే పూలమీద మోజు ఎంతకాలం మారినా తరగలేదు, తరగబోదు. క్యాబేజీ పూలూ గోబీపూలూ బీరపూలూ కూడా తల్లో పెట్టుకోవాలని సరదా పడుతుంది మా అమ్మాయి. పూలపిచ్చి ఎంత చెప్పినా అర్థం కానిది. పూలని మనం నిరాదరిస్తే చిరునవ్వుల్ని జీవితంలోంచి నిషేధించినట్లే -

# చదరంగపుటాల్జీబ్రా

ప్రపంచ చతురంగ పోటీలు కావు కాని మా ఇంట్లో మేవంతా చతురంగ ప్రవేశం చేయాలి సొచ్చింది. బాబీ, స్పాస్కీల పేర్లు నిత్యం రామనామస్మరణే -ఎక్కడో అయిసులాండట - అక్కడ ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు పోటీలు జరగడవేమీ, యిక్కడ మేము బుజాలు ఎగరెయ్యడమేవి? ఏమిటో ప్రపంచం చాలా చిన్నదయి పోతూంది ఎవరో అన్నట్లు - రోజూ పొద్దున్నే పేపరు రాంగానే టార్జాన్ కూడా చూడటం మానేసి వెనక్కు తిప్పి "ఇవాళ గేం" ఎలా ఆడారు, ఏం జరిగింది అని ఆత్రంగా చూడందే కాఫీ కూడా గుటకెయ్య బుద్ధి కావడంలేదు. పీకేఫోర్, పీకేబిత్రీ, పీక్యూఫోర్ లంటూ చదరంగపు టాల్జిబ్రా భాషరాని వాళ్ళు దంగై పోవడంకద్దు. ఇప్పుడిప్పుడే చదరంగం ఆట తెలీకపోవడం, క్రికెట్ ఆట చూడటం రాకపోవటమంత నేరమై కూర్చుంది. ఇది మేధావు లాడే ఆట కావటం వలన చదరంగంరాని పేకాట మిత్రులు ఈ మాట్లాడుకుంటూంటే, చిన్న మొహం చేసుకుంటున్నారు. అందులో అస్తమానం బాబీఅల్లా ఆడాడు, స్పాస్కీఇల్లా ఆడాడు ఆ బంటు తోయడం తప్పు, ఈ ఏనుగుల్ని యిలా వేయకుండా వుండాల్సింది అంటూ నోటికొచ్చినట్లు ప్రేలుతున్నప్పుడు ఈ ఆటరానివాళ్ళ ముఖాలు వచన కవిత్వం అర్థంకాని పాఠకుల ముఖాలకిమల్లే వెలవెలబారుతున్నాయి. ఎక్స్ ప్రెస్‌లో వేసిన ఆట భోగట్టా ప్రకారం బల్లమీద బలగాన్ని పేర్చి ఆడుకోవటం ఒక ఏకాంతపు సరదా అయిపోయింది.

ఈ గేములు డ్రా కావటం గురించి చర్చించుకునేప్పుడు చాలామంది ఆట రానివాళ్లు దీని పరిభాష విని "చదరంగపు టాల్జీబ్రా" కామోసుననుకుని, మనం వెనకబడిపోయామే అని నాలిక్కర్చుకుంటున్నారు గాభరాగా.

పేకాట గొప్పదా చదరంగవా అన్న ప్రశ్న చచ్చు ప్రశ్న. దీని మాహాత్మ్యం ముందు యితర ఇండోర్ గేమ్సన్నీ దిగదుడుపే - ఈ ఆటలో రాజ్యాలు పోతాయి, హత్యలు జరుగుతాయి - జయాపజయాలకు - ఆడవారిదే బాధ్యత పూర్తిగా. చూడండి క్రికెటువాళ్ళు పిచ్చి బాగులేదు. వర్షంపడింది, బంతి బరువు సరిగా లేదు అని సవాలక్ష కారణాలు చెప్పొచ్చు. చదరంగానికి

వాతావరణంలోని మార్పులతో సంబంధంలేదు. ఇందులో లక్కు ప్రసక్తి అసలే లేదు. వ్యక్తిగతమైన తెలివి, ప్రతిభ ముఖ్యం. తప్పాడితే క్షవరమయిపోతుంది. ఎక్కడ ఆడినా నెగ్గడానికి ఇద్దరికీ సమానావకాశాలున్నాయి. పేకాటలో అల్లాకాదే - ముక్కలు కలవాలి - ముక్కలు పడక పోవడం అనే పెంట ఓటి ఉంది. అంచేత దీన్ని రాయల్‌గేం అన్నారు దాన్ని అట్ట ముక్కల్తో ఆడే కార్డ్స్ గేం అన్నారు. పేకాటలో ఆస్తులు పోతాయి, ఇందులో మతులే పోతాయి. ఒకమాటు చదరంగం బల్ల బలం కొంటే మరిక కానీ ఖర్చుండదు. ఇంత కారుచవక గేం తెల్లార్లూ ఆడుకుందికి మరోటి లేదు -

"తోసిరాజు-ఆటకట్టు" అనే సామెతను విరివిగా వాడేస్తూంటాం. చదరంగం ఎవరికైనా ఇట్టే వస్తుంది. అదేం బ్రహ్మ విద్య కాదు. చాలా తేలిగ్గా నేర్చుకోవచ్చు. కాని జీవితంలో అన్ని విషయాలలో లాగే మంచి పార్టనర్ లేకుండా ఆడటం కష్టం. అన్ని బాధల్ను మర్చిపోడానికి, ప్రపంచానికి దూరం కావటానికి 'చదరంగం' ఆట ఒక గొప్ప పలాయన సూత్రం.

భగవంతుడైన శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతలో బోధించిన తత్వమే చదరంగపు టాటకున్న ఫిలాసఫీ. కొట్టు, నరుకు, చంపు - నువ్వు నిమిత్త మాత్రుడివి. ఎవరెల్లాటి ఎత్తులు వేస్తే వారికలాటి ఫలితం దక్కుతుంది. బంటుని చంపలేని వాడివి మంత్రిని చంపలేవు. మంత్రిని రక్షించుకోలేని వాడివి రాజు నెలా రక్షించుకోగలవు. ఆటలో కాని జీవితంతో కాని తప్పు చేయకు. తప్పుచేసి గెలవడం కష్టం. ఆత్మరక్షణ చేసుకోవడం తెలియక పోతే జీవితంలో అస్తమానూ ప్రతివాడిచేతా 'షా' అని అనిపించుకోవలసివస్తుంది. పోనీ కలబడి పోరాటం సాగిద్దామంటే అటోఇటో తేలిపోతుంది. జీవితంలో కూడా జాగ్రత్తగా ఆత్మరక్షణ చేసుకుంటూ వుండాలా? జీవితాన్ని ఎదుర్కొని పందెం ఒడ్డినట్టు పోరాడాలా?

జీవితంలో మనం ఆలోచిస్తే అన్నీ ఎత్తులు కాక మరేవిటి? ఒకప్పుడు రాజులా రాజాగా వుండాలనుకుంటాం. మన దగ్గరకి ఎవర్నీ రానివ్వం. వచ్చాడా చచ్చాడే - మరొకప్పుడు మంత్రిలా నిలువుగా అడ్డంగా ఐమూలలకు ముందుకూ వెనక్కూ కదుల్తూ ఆల్ పవర్‌ఫుల్‌గా జీవించాలనుకుంటాం. అలా జీవించాలనుకునే మరో మంత్రిలాటి వ్యక్తి తటస్థపడితే మనకూ వాడికీ హోరాహోరీ యుద్ధం తప్పనిసరి కదా -

బంటు సరైనచోట పడితే ఎలా ఆట టకటక లాడిస్తాడు?

నిజంగా చదరంగం గురించి ఆలోచిస్తే ఈ ప్రపంచంలో అన్ని రంగాలలోనూ పోరాటమే తప్ప సర్వైవలాఫ్‌ది ఫిట్టెస్టు మరొక థీరీ ఏదీ పనికిరాదని చిన్నపిల్లాడికైనా తెలిసిపోతుంది. చదరంగం క్రీడలో అహింస లేదు హింసేవుంది. ఎత్తులు పై ఎత్తులు దవుర్జన్యంకాక మరేవిటుంది రాజకీయాల్లో కాని జీవితంలో కాని?

నిన్నగాక మొన్న పాకిస్తానీ వాడితో యుద్ధం. గెలవటానికి రష్యాతో ఒడంబడిక చదరంగపు టెత్తు కాదూ. భారత ఉపఖండంలో శాంతికి బంగ్లాదేశ్ విముక్తికి మనం సలిపిన పోరాటంలో ఎత్తుగడలేదూ. అమెరికా చైనాలు పాకిస్తాన్‌కు యుద్ధంలో సహాయంగా బలాన్ని దింపి డైరెక్టుగా

పోరాటానికి ఎందుకు రాలేకపోయారు? అదీ చదరంగపుటెత్తే – గనుక ప్రపంచాన్ని అగ్రరాజ్యాలు వాటాలు వేసుకొని పంచుకోడానికి యుద్ధాలు అవసరం. ఆమాటకొస్తే అహింసాయుతంగా పోరాడమన్నది కూడా హింసాయుతంగా పోరాటాన్ని కొనసాగించలేక వేసిన గమ్మత్తయిన ఎత్తేకాని అది సర్వరోగ నివారిణికాదు.

ఇంతకీ మీరు చదరంగం ఆడండి. మీకు రాజకీయాలు ఎంత సులువుగా బోధపడతాయో మీ బుద్ధి ఎంత వికసిస్తుందో దానంతటదే మీకు తెలుస్తుంది. వుండండి – మా వారు గుర్రాన్ని తీస్తున్నారు. అది ఏనుగుమీదా, మంత్రిమీదా, రాజుమీదా పడేట్లుంది....

# మోడ్రన్ దమయంతుల శృంగార నైషధం

శతకోటి సీలింగులకు అనంతకోటి ఉపాయాలన్నారు పెద్దలు. లోపాయకారీగా మనంతట మనవే ఎన్నో సీలింగులను ఐచ్ఛికంగా పెట్టుకుంటున్నాము. ఇన్ని అంట్లయితే నేను తోవలేనండమ్మగారూ అంటుంది పనిమనిషి. ఇంతగా మాపితే మేం ఉతకలేమండీ అంటుంది రజక స్త్రీ (రజకుడ్ని రజకశ్రీ అనాలి కవిశ్రీలాగ) రోడ్ల పేరుల్ని మార్చగలంగాని రోడ్డు స్వభావాన్ని అంటే గుంటల్నీ గోతుల్నీ మార్చగలవా – అల్లాగే సీలింగుల్ని పెట్టగలంకాని ప్రజల స్వభావాన్ని మార్చగలవా? మార్చలేం – మార్చలేం. ఇప్పుడు గో సంరక్షణ చేసేవాళ్ళూ, తిక్కశంకరాచార్లూ ఒక్క మాటనరేవి? ఎందుకంటారా? హిందూమత సంప్రదాయం ప్రకారం మన ప్రాచీన ఆర్షవైదిక వివాహ సంస్కృతి ననుసరించి "నాతిచరామి" అని ఏవేవో వల్లించిన సంపన్న కుటుంబాల్లోని ఆంధ్ర నారీమణులు మతం మార్చుకుని వెధవ ఆస్తికోసం తాళికట్టిన భర్తల్నుంచి విడాకులు పొందటంకోసం కోర్టుల చుట్టూ రిజిస్ట్రారాఫీసుల చుట్టూ తిరగనేల?

మన కల్చర్ మన భాష మన ఆచారాలు సంప్రదాయాలకు ప్రతి నిధులు పూజ్యులు అనుకుంటున్న మన స్త్రీలు అన్ని విలవలకూ నీతి నియమాలకూ ధర్మసూత్రాలకూ "టాటా" చెప్పి విడాకులకోసం ఎగబడుతున్నారట – వెధవ ఆస్తికోసం.

వెధవ ఆస్తి అని ఎందుకన్నానంటే ఒక పిక్చర్ తీస్తే పోతుంది. ఒక ముచ్చటైన మూడు రంగుల సచిత్ర మాసపత్రిక పెడితే పోతుంది. పేకాడితే పోతుంది. దక్షిణ నాయకుడ్నని పించుకోవడం కోసం పదిమంది స్నేహితురాళ్ళ కోసం ఖర్చుపెడితే పోతుంది. తెలియకుండా ఏదైనా వ్యాపారం పెడితే పోతుంది. ఆస్తి అనేది హారతి కర్పూరం లాంటిది.

అటువంటి ఆస్తికోసం అగ్నిసాక్షిగా బెండ్లియాడిన ఇల్లాలికి మతం యిప్పించి మరో మరో కారణం జూపించి విడిపోయినట్లు "విడాకులు" పుచ్చుకోనేల? మరి మన్ది ధర్మంకోసం పడిచచ్చిపోయే జాతి అనుకుంటావే? కాదా?